# ఆదిలాబాద్ వార్త




మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

ఆదివారం 29, మార్చి 2026




జాతీయ వేదికపై మరోసారి

## విరాజిల్లిన నిర్మల్ జిల్లా ఖ్యాతి

- ✦ జిల్లాకు రెండు ప్రతిష్టాత్మక స్కోచ్ అవార్డులు
- ✦ ఢిల్లీ వేదికగా స్వీకరించిన జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, అధికారులు

**నిర్మల్, మార్చి 28, ప్రభాతవార్త:** జాతీయ వేదికపై మరోసారి నిర్మల్ జిల్లా ఖ్యాతి ప్రజరిల్లింది. జిల్లాకు రెండు ప్రతిష్టాత్మక స్కోచ్ అవార్డులు దక్కాయి. వివిధ జిల్లా శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన వినూత్న కార్యక్రమాలకు గాను అవార్డులు నిర్మల్ జిల్లా సొంతం చేసుకుంది. ఢిల్లీ వేదికగా జరిగిన ఈ అవార్డులను జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, సంబంధిత శాఖలతో కలిసి స్వీకరించారు. నిర్మల్ జిల్లాకే తలమాణికమైన కొయ్య బొమ్మల పరిరక్షణ, చారిత్రాత్మక వారసత్వాన్ని భావితరాలకు అందించాలనే సంకల్పంతో.. కొయ్య బొమ్మల తయారీకి ఉపయోగించే పొనికి కర్రల పెంపకం కోసం ఏర్పాటు చేసిన పొనికి వనానికి గాను లభించిన జాతీయస్థాయి స్కోచ్ అవార్డును జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి విజయలక్ష్మితో కలిసి స్వీకరించారు. జిల్లాలో అమ్మరక్షిత అనే వినూత్న కార్యక్రమం ద్వారా మాతృత్వ మరణాలు మిగతా 2లో..

## మురళీగూడ దాహం తీర్చండి...



- ➡ అసెంబ్లీలో ఎమ్మెల్యే హరీష్ బాబు డిమాండ్
- ➡ నదులు పక్కనే ఉన్నా దాహార్తితో ప్రజలు
- ➡ ఎడ్లబండ్లపై కిలోమీటర్ల దూరం నుంచి నీటి తరలింపు
- ➡ సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి

**పెంచికల్‌పేట్, మార్చి 28, ప్రభాతవార్త :** కొమరం భీం జిల్లా పెంచికల్ పేట్ మండలంలోని మురళీగూడ గిరిజన గ్రామంలో నెలకొన్న తీవ్ర త్రాగునీటి సమస్యపై రాష్ట్ర అసెంబ్లీలో గళమెత్తారు సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు. గ్రామ ప్రజలు పడుతున్న ఇబ్బందులను వివరంగా ప్రస్తావిస్తూ ప్రభుత్వం తక్షణమే స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని శనివారం డిమాండ్ చేశారు. గ్రామంలో బోర్లు ఎండిపోవడం, మిషన్ భగీరథ సరఫరా వ్యవస్థ సరిగా లేకపోవడం వల్ల మహిళలు, వృద్ధులు కిలో మీటర్ల మేర కాలి నడకన వెళ్లి నీళ్లు తెచ్చుకునే దుస్థితి నెలకొందని తెలిపారు. రోజువారీ జీవనం కష్టసాధ్యంగా మారిందని సభలో ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామానికి సమీపంలోనే ప్రాణహిత, పెద్దవాగు నదులు ప్రవహిస్తున్నప్పటికి త్రాగునీరు అందుబాటులో లేకపోవడం బాధాకరం అన్నారు. సమస్య పరిష్కరించడానికి తమ వద్ద కూడా ఏసీడీపీ నిధులు లేవన్నారు. గ్రామానికి సమీప జలవనరులను వినియోగిస్తూ పైపులైన్ ద్వారా నీటి సరఫరా కల్పించాలని, వేసవి ఎద్దడి నుంచి కాపాడేందుకు ప్రత్యేక నిధులు మిగతా 2లో..



## ఆర్టీసీ సమస్యలపై ప్రజాప్రతినిధులతో మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖాముఖి

**నిర్మల్, మార్చి 28, ప్రభాతవార్త:** ఉమ్మడి జిల్లాల వారీగా ఆర్టీసీ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ నిర్వహిస్తున్న ముఖాముఖి సమావేశాలు మూడవ రోజుకు చేరుకున్నాయి. శనివారం అసెంబ్లీ కమిటీ హాల్‌లో ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, ఖమ్మం జిల్లాల ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులతో మంత్రి ప్రత్యేకంగా సమావేశమయ్యారు. మహాలక్ష్మి పథకం వల్ల పెరిగిన రద్దీకి అనుగుణంగా కొత్త బస్సులు, రూట్లు, బస్ స్టేషన్ల అభివృద్ధిపై చర్చించారు. సమావేశంలో ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల వారీగా వినతిపత్రాలు సమర్పించారు. వివేక్ వెంకటస్వామి (చెన్నూరు), సంజయ్ కుమార్ (కోరుట్ల), ఆది శ్రీనివాస్ (వేములవాడ) తమ ప్రాంతాల్లో బస్ స్టేషన్ల ఆధునీకరణ, కొత్త సర్వీసులు కావాలని కోరారు. పాడి కౌశిక్ రెడ్డి (హుజురాబాద్), విజయరమణరావు (పెద్దపల్లి), మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ (రామగుండం) డిపోల ఏర్పాటు, అదనపు బస్సుల అవశ్యకతను వివరించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుండి వెడ్మ బొజ్జు (ఖానాపూర్), కోవా లక్ష్మి (ఆసిఫాబాద్), రామారావు పటేల్ (ముధోల్), పాల్వాయి హరీష్ (సిర్పూర్) మారుమూల గ్రామాలకు పల్లె వెలుగు బస్సులు నడపాలని, బాసర వంటి పుణ్యక్షేత్రాల్లో సౌకర్యాలు పెంచాలని కోరారు. ఖమ్మం జిల్లా నుండి అదనపు బస్సులు, శిథిలావస్థలో ఉన్న బస్ స్టేషన్ల పునర్నిర్మాణంపై ఎమ్మెల్యేలు విన్నవించారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ప్రజాప్రతినిధుల సూచనల మేరకు రాష్ట్రవ్యాప్తంగా కొత్త రూట్ల కోసం యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నామన్నారు. బస్ స్టేషన్లలో టాయిలెట్లు, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తామని హామీ ఇచ్చారు. ఆర్టీసీ అధికారులు ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ సంస్థకు మంచి పేరు తేవాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, ఉన్నతాధికారులు మరియు పలువురు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

### బోథ్ నియోజకవర్గ ఆర్టీసీ సమస్యలపై మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఎమ్మెల్యే అనిల్ జాదవ్ వినతి



**నేరడిగొండ, మార్చి 28, ప్రభాతవార్త:** బోథ్ నియోజకవర్గంలోని ఆర్టీసీ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ శనివారం రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు విన్నవించారు. హైదరాబాద్‌లోని అసెంబ్లీ కమిటీ హాల్‌లో ఉమ్మడి జిల్లాల ప్రజాప్రతినిధులతో మంత్రి నిర్వహించిన ముఖాముఖి సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బోథ్ మండల కేంద్రంలో నూతనంగా ఆర్టీసీ డిపోను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గంలోని మారుమూల గిరిజన గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని, ప్రధాన గ్రామాల్లో బస్ షెల్టర్లను నిర్మించాలని కోరారు. ముఖ్యంగా ఇచ్చోడ బస్టాండ్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం సీసీ రోడ్లు, మిగతా 2లో..

## మురళీగూడ దాహం తీర్చండి...

(మొదటిపేజీ తరువాయి)

కేటాయించాలని, కనీసం చేతిపంపులైన మంజూరు చేయాలని కోరారు. సమస్యను అత్యవసరంగా పరిగణించి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని సంబంధిత మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే ప్రస్తావనపై స్పందించిన సంబంధిత శాఖ మంత్రి సమస్యను పరిశీలించి త్వరితగతిన పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చినట్లు సమాచారం. మురళీగూడ గ్రామ ప్రజలు తమ సమస్యను అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలుపుతూ, త్వరలోనే శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## బోథ్ నియోజకవర్గ ఆర్టీసీ సమస్యలపై మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఎమ్మెల్యే అనిల్ జాదవ్ వినతి

(మొదటిపేజీ తరువాయి)

మరుగుదొడ్లు, రెస్ట్ రూమ్‌లు, తాగునీటి వసతి కల్పించాలని మంత్రికి అందజేసిన వినతిపత్రంలో పేర్కొన్నారు. ప్రజా రవాణా వ్యవస్థను బలోపేతం చేసి పేద ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## వేసవిలో విద్యుత్ సరఫరాకు అనుగుణంగా పూర్తి సన్నద్ధం

**ఆసిఫాబాద్, మార్చి 28, ప్రభాతవార్త :**

వేసవి కాలంలో వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన విద్యుత్తును అందించడంపై పూర్తిగా దృష్టి సారించినామని కుమురంభీమ్ ఆసిఫాబాద్ సర్కిల్ సూపెరింటెండింగ్ ఇంజనీర్ ఉత్తమ్ జాడే శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని గతేడాది నుంచే అప్రమత్తత్తంగా ఉన్నామని, ఏ విపత్తు ఎదురైనా సరఫరాను నిరంతరాయంగా అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఇప్పటి వరకు విద్యుత్ లోడ్ పెరిగే ప్రాంతాలలో అంచనా మేరకు సర్కిల్ వ్యాప్తంగా నూతన నియంత్రికలను క్షేత్ర స్థాయిలో ఏర్పాటు చేశామని తెలిపారు. ఉపకేంద్రాల సామర్థం పెంచేలా సబ్ స్టేషన్లు, పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థం పెంచి అందుబాటులోకి తెచ్చామని వెల్లడించారు. వినియోగదారులకు నిరంతర సరఫరా అందించాలనే ఉద్దేశంతో ఇంటర్‌లింకింగ్ వ్యవస్థను తీసుకొచ్చామని, ఇప్పటివరకు అన్ని చోట్ల ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరా అందిస్తున్నామని, అత్యవసర పరిస్థితులు ఎదురైనా, ఏదైనా ఉపకేంద్రంలో సమస్య తలెత్తినా ఆ పరిధిలో అంతరాయం ఏర్పడినా పరిష్కారమయ్యే వరకు మరో కేంద్రం నుంచి సరఫరాను పునరుద్ధరించేందుకు చేసిన ఏర్పాట్లు దోహదపడుతుందని తెలిపారు. ఒకదానికి ఒకటి అనుసంధానం చేస్తు పనులు పూర్తి చేశామని వెల్లడించారు.

# అక్రమ ఇసుక తరలింపుపై ఫిర్యాదు

**వేమనపల్లి, మార్చి 28, ప్రభాతవార్త**

వేమనపల్లి మండలంలో గత కొన్ని రోజులుగా యథేచ్ఛగా కొనసాగుతున్న ప్రాణహిత నుంచి అక్రమ ఇసుక తరలింపుపైన శనివారం మండల తహశీల్దార్ కార్యాలయంలో బిజెపి మండల ప్రధాన కార్యదర్శి కొప్పుల చరణ్ రాజ్ వినతి పత్రం అందజేశారు. పిర్యాదులో ఇలా ఉంది మండలంలో కేవలం అధికార పార్టీ నాయకుల అండదండలతో వాళ్ల పార్టీ నాయకులకు సంబంధించిన ట్రాక్టర్లు మాత్రమే యథేచ్ఛగా ఇసుక రవాణా చేస్తున్నాయని, ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పేరుతో లబ్దిదారులకు కాకుండా ఇసుకను ప్రక్కన ఉన్నటువంటి కోటపల్లి మండలంలోని మల్లంపేట్ దాని చుట్టూ ప్రక్కల ఉన్నటువంటి గ్రామాలకు అర్ధరాత్రి వేళల్లో ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా ఇసుకను తరలిస్తూ (3500 నుండి 4000వేల రూపాయలకు) అమ్ముకుంటున్నారని, కేవలం ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పేరుతో యథేచ్ఛగా తరలిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక ఇంటి నిర్మాణం కొరకు సగటున 20 ట్రిప్పుల ఇసుక అవసరం ఉంటే అదే లబ్దిదారుని పేరుతో ఉన్న మంజూరు పత్రం చూపిస్తూ మండల తహశీల్దార్ కార్యాలయం నుండి ఇచ్చిన పర్మిషన్ పత్రం ఉందంటూ మిగతా వారికి అమ్ముకుంటున్నారు. ఇలా ప్రాణహిత నుండి ఇసుకను



తరలించడానికి జిల్లా మైనింగ్ శాఖ అధికారుల నుండి ఏదైనా పర్మిషన్ పత్రం ఉందా అని ట్రాక్టర్ యజమానులను అడిగితే ఎలాంటి సమాధానం చెప్పడం లేదు, కేవలం ఇందిరమ్మ లబ్దిదారులకు తప్ప సామాన్య ప్రజలకు ఇసుక దొరకడం చాలా కష్టంగా మారిందని ఇక మండలంలో ప్రాణహిత ఉంది కానీ గోదావరి లేని కారణంగా ఇసుక రీచ్ లేదు కనుక ఆన్లైన్ ద్వారా బుక్ చేసుకోవడానికి అవకాశం లేకుండా పోయింది ఇక ఆన్లైన్ ద్వారా చెన్నూర్ ప్రాంతంలోని సమీప ఇసుక రీచ్ నుండి కొనుగోలు చేస్తే చాలా డబ్బులు వెచ్చించాల్సి వస్తుంది పేదవారు అంత డబ్బు పెట్టి కొనుకోలేని స్థోమత కలిగిన నిరుపేదలు మండలంలో చాలా మంది ఉన్నారు. ప్రజలు సొంతంగా ఇల్లు మరుగుదొడ్లు, సౌకర్యార్థం ప్రహరీ గోడ కట్టుకోవడానికి ఇసుక కరువైన పరిస్థితి మండలంలో నెలకొంది కనుక అధికారులు ఇకనైనా మండల ప్రజల అవసరం నిమిత్తం అందరికీ న్యాయం చేకూర్చి ఇసుక అందేలా చూడలని అక్రమంగా ఇసుక తరలిస్తున్న వారిపైన కఠిన చర్యలు తీసుకోవాలని లేదంటే ఉన్నత స్థాయి జిల్లా అధికారులకు ఫిర్యాదు చేస్తామని పిర్యాదులో తెలిపారు.

## జాతీయ వేదికపై మరోసారి విరాజిల్లిన నిర్మల్ జిల్లా ఖ్యాతి

(మొదటిపేజీ తరువాయి)

తగ్గించినందుకు లభించిన మరో స్కోచ్ అవార్డును వైద్యరోగ్య శాఖ అధికారి రాజేందర్ తో కలిసి కలెక్టర్ స్వీకరించారు. అవార్డు స్వీకరణ అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, మరోసారి జిల్లాకు జాతీయ వేదికలో అవార్డు రావడం ఎంతో గొప్ప విషయమని పేర్కొన్నారు. అధికారుల ఉత్తమ పనితీరుతో ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేసి, అవార్డు సాధనలో కృషి చేసిన అధికారులు అందరికీ ఈ సందర్భంగా కలెక్టర్ శుభాకాంక్షలు తెలియజేశారు.

# భైంసా మార్కెట్ యార్డులో రైతు భరోసా సంబరాలు

- రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం



**భైంసా, మార్చి 28, ప్రభాతవార్త:**

నిర్మల్ జిల్లా భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో శనివారం రైతు భరోసా నిధుల విడుదలపై హర్షం వ్యక్తం చేస్తూ సంబరాలు నిర్వహించారు. మార్కెట్ కమిటీ ఛైర్మన్ సిందే ఆనందరావు పటేల్, వైస్ ఛైర్మన్ ఫారూఖ్ అహ్మద్ ఆధ్వర్యంలో రైతులు పెద్ద ఎత్తున పాల్గొని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఛైర్మన్ ఆనందరావు పటేల్ మాట్లాడుతూ.. రాష్ట్ర ఇన్‌ఛార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశాల మేరకు ఈ విజయకోత్సవం నిర్వహించినట్లు తెలిపారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, అన్నదాతల సంక్షేమం కోసం రైతు భరోసా నిధులు విడుదల చేయడం అభినందనీయమన్నారు. రైతులకు అండగా నిలుస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు, ఇన్‌ఛార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావుకు కాంగ్రెస్ పార్టీ పక్షాన ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ భూమన్న, సిరల సర్పంచ్ మోహనరావు పటేల్, మాజీ డైరెక్టర్ మేకల దేవదాస్, సగ్గం దిగంబర్, సేవాదళ్ బ్లాక్ అధ్యక్షుడు కదం ఆత్మారాం, కదం వెంకటరావు, బాసర మండల అధ్యక్షుడు బండోళ్ల అనిల్, భైంసా మండల అధ్యక్షుడు అల్లం పోశెట్టి, సేవాదళ్ కార్యదర్శి అబ్దుల్ అజార్, రైతు మహిళలు, నాయకులు పాల్గొన్నారు.

# ప్రమాదాల ముప్పుకు చెక్.. స్టడ్ లైట్స్ ఏర్పాటు

**కాగజ్‌నగర్, మార్చి 28, ప్రభాతవార్త :**

పట్టణ ప్రధాన రహదారి నుంచి ఈస్ గ్నాకు వెళ్లే మార్గంలో ఉన్న ఇరుకువంత వద్ద తరచూ జరుగుతున్న ప్రమాదాలను నివారించేందుకు స్థానిక యువకుడు సేవాభావంతో ముందుకొచ్చాడు. కల్వర్టు ఇరుకుగా ఉండటంతో వాహనదారులు రాత్రి వేళల్లో ప్రమాదాలకు గురవుతున్న నేపథ్యంలో, ఈస్ గ్నాకు చెందిన ప్రీతీష్ కుమార్ మండల్ స్వచ్ఛందంగా చర్యలు చేపట్టారు. వంత సమీపంలో రోడ్డుకు ఇరువైపులా స్టడ్ లైట్స్ ఏర్పాటు చేయించారు. ఈ స్టడ్ లైట్స్ కారణంగా రాత్రి సమయంలో వాహనదారులకు మార్గం స్పష్టంగా కనిపించడంతో పాటు, ఎదురెదురుగా వచ్చే వాహనాలపై అప్రమత్తత పెరుగుతుందని స్థానికులు పేర్కొన్నారు. ముఖ్యంగా ఇరుకైన వంత ప్రాంతంలో వాహనాలు సురక్షితంగా వెళ్లేందుకు ఈ ఏర్పాట్లు ఎంతో ఉపయోగపడుతున్నాయని తెలిపారు. ఇప్పటి వరకు చీకటి కారణంగా వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొనేవారని, ఇప్పుడు స్టడ్ లైట్స్ వల్ల ప్రమాదాల ముప్పు తగ్గుతుందని ప్రయాణికులు అభిప్రాయపడుతున్నారు. సేవాభావంతో స్వంత ఖర్చుతో ఈ పనిని చేపట్టిన ప్రీతీష్ కుమార్ మండల్‌ను స్థానికులు అభినందిస్తున్నారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకొని చేసిన ఈ చర్య ఇతరులకు కూడా ఆదర్శంగా నిలుస్తుందని పలువురు పేర్కొన్నారు. అధికారులు కూడా ఇలాంటి సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



స్టడ్ లైట్స్ ఏర్పాటు చేస్తున్న దృశ్యం

# గ్రంథాలయాల అభివృద్ధికి చర్యలు

**ఆసిఫాబాద్, మార్చి 28, ప్రభాతవార్త**

జిల్లాలోని గ్రంథాలయాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని ఆ సంస్థ పర్సన్ ఇంచార్జి, అదనపు కలెక్టర్ ఎం.డెవిడ్ పేర్కొన్నారు. శనివారం అదనపు కలెక్టర్ ఛాంబర్ లో పంచాయతీరాజ్, విద్యాశాఖ, గ్రంథాలయ శాఖ, మున్సిపల్ శాఖ, అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని గ్రంథాలయాల అభివృద్ధికి అధికారులు కృషి చేయాలన్నారు. గ్రంథాలయాలకు వచ్చే పాఠకులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. గ్రంథాలయాల్లో మౌలిక వసతులు వుండేలా చర్యలు తీసుకోవాలన్నారు. చరిత్రకు సంబంధించిన గ్రంథాలయ సర్వస్వము ఈ విజ్ఞాన సూచిక, ఎంప్లాయిమెంట్ న్యూస్ కురుక్షేత్ర, యోజన, కస్టమర్ అవాజ్ పునాది వంటి తెలుగు, ఇంగ్లీష్ మ్యాగ్ జైన్లు ఉండాలన్నారు. పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు సరిపడా మెటీరియల్స్ ను అందుబాటులో ఉంచాలని అన్నారు. గ్రంథాలయాల అభివృద్ధికి పంచాయతీలు, మునిసిపల్ శాఖలు, గ్రంథాలయ సెస్సులను చెల్లించాలన్నారు. ఈ సందర్భంగా 2026 27 ఆర్థిక సంవత్సరము వార్షిక పద్దును ఆమోదించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ కార్యదర్శి ఏ. సరిత, జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి, లైబ్రరీయన్ లు సదానందం, ప్రవీన, విద్య, మున్సిపల్ శాఖ అధికారులు పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయ సంస్థ పర్సన్ ఇంచార్జి అదనపు కలెక్టర్ ఏం.డెవిడ్

## వాంకిడి మేజర్ గ్రామ పంచాయతీ గ్రామసభపై ఆగ్రహం

**వాంకిడి మార్చ్ 28 ప్రభాతవార్త :**


పంచాయతీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న దుర్గం ప్రశాంత్

వాంకిడి మండలంలో గ్రామ సభ నిర్వహణపై దుర్గం ప్రశాంత్ మరియు స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ముందస్తు సమాచారం ఇవ్వకుండా గ్రామ సభ నిర్వహించారని ఆరోపిస్తూ గ్రామ పంచాయతీ అధికారులను నిలదీశారు.గ్రామ సభ నిర్వహణకు కనీసం 7 రోజుల ముందుగానే ప్రజలకు సమాచారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే నోటీస్ బోర్డును సక్రమంగా నిర్వహించి, ప్రభుత్వ పథకాల వివరాలను ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలని సూచించారు.గ్రామ సభలు పారదర్శకంగా, ప్రజల భాగస్వామ్యంతో నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు

## ఘనంగా శ్రీరామ పట్టాభిషేకం



**తాండూర్, మార్చి 28, ప్రభాతవార్త :**

మండలంలోని మాదారంటౌన్ షిప్ శ్రీ కోదండ రామాలయంలో బెల్లంపల్లి ఓసిపి ఉమాకాంత్, సుబ్రహ్మణ్యం దంపతుల చేత శ్రీరామ పట్టాభిషేకాన్ని వేద పండితులు ముద్దు అవధూత శర్మ ఘనంగా జరిపించారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి ఏరియా సింగరేణి సేవా సమితి అధ్యక్షురాలు పద్మ మహిళలు పాల్గొన్నారు.అదేవిధంగా బోయపల్లి శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో శ్రీరామ పట్టాభిషేకం నిర్వహించారు. భక్తులు, మహిళలు పట్టాభిషేక కార్యక్రమాన్ని తిలకించారు. అనంతరం తీర్థ ప్రసాదం వితరణ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శ్రీదేవి, భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇల్లు నిర్మాణానికి భూమి పూజ

**జైపూర్, మార్చి 28, ప్రభాతవార్త**

పెగడపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు.గ్రామానికి చెందిన రామగిరి మోనిక ప్రవీణ్ దంపతుల గృహ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు.ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి శ్రావణి మాట్లాడుతూ, ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా పేదలకు గృహ వసతి కల్పించడం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లు అందేలా చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రామగిరి రామన్న, వార్డ్ మెంబర్ మల్లేష్, కాంగ్రెస్ నాయకులు నిట్టూరి జనార్ధన్, సడవలి లింగన్న తదితరులు పాల్గొన్నారు.



## ఇంకుడు గుంత నిర్మాణం ఇంటి నిర్మాణంలో భాగం

### - ఎంపిడిఓ సత్యనారాయణ

**జైపూర్, మార్చి 28, ప్రభాతవార్త**

ఇంకుడు గుంత నిర్మాణం ప్రతి ఇంటి నిర్మాణంలో భాగం కావాలని ఎంపిడిఓ గుర్రం సత్యనారాయణ అన్నారు. శనివారం ముదిగుంట గ్రామ పంచాయతీని సందర్శించి గ్రామంలో ఇంటింటికి నిర్మించిన ఇంకుడు గుంతలను పరిశీలించారు. ఈ ఇంకుడు గుంతల నిర్మాణం వలన లబ్ధిదారులకు, గ్రామానికి జరిగిన ప్రయోజనాలను లబ్ధిదారుల నుంచి తెలుసుకున్నారు. వాటర్ షెడ్ డిపార్ట్మెంట్ వారు ఫారెస్ట్ లో చేపట్టిన నీటి కుంటలను కూడా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ముదిగుంట గ్రామ పంచాయతీ సర్పంచ్ ఆకుల రవికుమార్, జైపూర్, ఎంపిఓ శ్రీపతి బాపురావు, పంచాయతీ కార్యదర్శి పి.సురేష్, ఉపాధి హామీ సిబ్బంది, టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్ పాలకవర్గ సభ్యులు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.




వేలం నిర్వహిస్తున్న అధికారులు

## తై బజార్ సంతకు రూ.10.80 లక్షల వేలం

**జైనూర్,మార్చ్ 28 ప్రభాతవార్త:**

కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండల కేంద్రంలో ప్రతి గురువారం నిర్వహించే తై బజార్ సంతను శనివారం గ్రామపంచాయతీ కార్యాలయంలో వేలం వేసినట్లు మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ కొడప ప్రకాష్, ఇన్చార్జి ఈఓ ఆనందరావు తెలిపారు. 2026–27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన కూరగాయల తై బజార్ సంత వేలంపాటలో పలువురు వేలందారులు పోటాపోటీగా పాల్గొన్నారు. ఇందులో గేడం లక్ష్మణ్ అత్యధికంగా రూ.10 లక్షల 80 వేలుకు సంతను దక్కించుకున్నారు. ఈ వేలంపాట కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అబ్దుల్ ముఖిద్, కాంగ్రెస్ నాయకుడు దండుగుల మహేష్ కుమార్, పంచాయతీ సిబ్బంది, వేలందారులు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న తల్లిదండ్రులు పాఠశాల ఉపాధ్యాయులు

## శ్రీ చైతన్య పాఠశాలలో హ్యాపీ క్లబ్ కార్యక్రమం

**మంచిర్యాల, మార్చి 28, ప్రభాతవార్త**

శ్రీ చైతన్య పాఠశాల మంచిర్యాల లక్ష్మీనగర్ శాఖ ఆధ్వర్యంలో శనివారం హ్యాపీ క్లబ్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా తల్లిదండ్రులందరినీ పాఠశాలకు ఆహ్వానించి పిల్లలు ఒక్కొక్కరుగా తమ తల్లిదండ్రుల పాదాలను నీటితో కడిగి, ప్రతిఫలంగా వారి ఆశీర్వాదాలను అందుకున్నారు. చాలా మంది తల్లిదండ్రులు తమ భావోద్వేగాలను అదుపు చేసుకోలేక పోయారు.ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించినందుకు తల్లిదండ్రులందరూ పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం అరవింద్రెడ్డి, కోఆర్డినేటర్ నాగరాజు, ప్రిన్సిపాల్ అయూబ్, డీన్ శ్యామ్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై బిఎల్ఓలకు శిక్షణ

**జైపూర్, మార్చి 28, ప్రభాతవార్త**

జైపూర్ మండల పరిధిలోని బూత్ స్థాయి అధికారులైన బి.ఎల్.ఓలకు, ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పై జైపూర్ తహాశీల్దార్ కార్యాలయంలో శనివారం తహాశీల్దార్ వనజా రెడ్డి శిక్షణ నిర్వహించి అవగాహన కల్పించారు. ఉదయం 10.30 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంటల వరకు సమావేశంలో బిఎల్ఓలకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎలక్షన్ కమిషన్ ఆదేశాల కనుగుణంగా ఏప్రిల్ నెలలో సర్ నిర్వహించడం జరుగుతుందని,బి.ఎల్.ఓ లు ముందస్తుగా మరణించిన ఓటర్ల జాబితా, వలస వెళ్లిన ఓటర్ల జాబితా సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నాయబ్ తహాశీల్దార్ సంతోష్, ఎలక్షన్ సూపర్వైజర్లు అపర్ణ దేవి, తిరుపతి, స్వామి, మండలంలోని బిఎల్ఓలు పాల్గొన్నారు.



## ఈ నెల 31న ఇసుక వేలం పాట

**సారంగాపూర్, మార్చి 28, ప్రభాతవార్త:**

మండల కేంద్రం పరిధిలో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుకను ఈ నెల 31న వేలం వేయనున్నట్లు తహసీల్దార్ సంధ్యారాణి తెలిపారు. గతంలో నిర్వహించిన తనిఖీల్లో సుమారు 40 నుండి 50 ట్రాక్టర్ల ఇసుక నిల్వలను రెవెన్యూ అధికారులు గుర్తించి సీజ్ చేశారు. జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశాల మేరకు జప్తు చేసిన ఈ ఇసుకకు మంగళవారం వేలం పాట నిర్వహించనున్నారు. వేలం పాటలో పాల్గొనదలచిన వ్యక్తులు ముందుగా రూ. 5,000 ధరావత్తు (డిపాజిట్) చెల్లించాల్సి ఉంటుంది. ఒక ట్రాక్టర్ లోడు ఇసుక ధరను రూ. 1,800గా నిర్ణయించినట్లు తహసీల్దార్ వెల్లడించారు. నిబంధనలకు లోబడి ఆసక్తి గలవారు ఈ వేలం పాటలో పాల్గొనాలని ఆమె కోరారు.



## సారంగాపూర్ మండల కేంద్రంలో వారసంత వేలం పాట

**సారంగాపూర్, మార్చి 28, ప్రభాతవార్త:**

సారంగాపూర్ మండల కేంద్రంలో వారసంత నిర్వహణ కోసం ఈ నెల 30న మధ్యాహ్నం 1:00 గంటకు గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి కృష్ణ తెలిపారు. ఈ వేలం ద్వారా ఎంపికైన వారు 2026 ఏప్రిల్ 1 నుండి 2027 మార్చి 31 వరకు సంతను నిర్వహించుకోవచ్చు. వేలం పాటలో పాల్గొనే వారు రూ. 1,000 డిపాజిట్ చేయాలని, పంచాయతీకి ఎలాంటి పన్ను బకాయిలు ఉండకూడదని స్పష్టం చేశారు. వేలం ఖరారైన వెంటనే సగం సొమ్ము చెల్లించి రసీదు పొందాలని, మిగిలిన మొత్తానికి అగ్రిమెంట్ రాసిచ్చి పోస్ట్ డేటెడ్ చెక్కులు సమర్పించాలని సూచించారు. రెండో వాయిదాను డిసెంబర్ చివరి వారంలోపు చెల్లించాల్సి ఉంటుంది. గడువులోపు నగదు చెల్లించని పక్షంలో రెండో వ్యక్తికి అవకాశం ఇస్తామని, వేలాన్ని రద్దు చేసే అధికారం పంచాయతీ అధికారికి ఉంటుందని ఆయన వివరించారు.

## అక్రమ రైస్‌మిల్‌కు వ్యతిరేకంగా గ్రామస్తుల ఆందోళన



**దిలావర్‌పూర్, మార్చి 28, ప్రభాతవార్త:**

దిలావర్‌పూర్ గ్రామ పంచాయతీ పరిధిలో బస్టాండ్ సమీప జూనియర్ కళాశాల ప్రాంతంలో అక్రమంగా నిర్మిస్తున్న రైస్ మిల్‌పై గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎంపీవో, సర్పంచ్, ఈవో, ఉపసర్పంచ్‌లకు వినతిపత్రాలు అందజేశారు. కళాశాల, నివాస గృహాలు, దేవాలయాలు సమీపంలో రైస్ మిల్ నిర్మాణం చేపడితే శబ్దం, కాలుష్యం వల్ల ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతాయని గ్రామస్తులు పేర్కొన్నారు. అందువల్ల పంచాయతీ ద్వారా ఎలాంటి అనుమతులు మంజూరు చేయరాదని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వీరేష్ కుమార్, వార్డు సభ్యులు అనిల్, రవి, శ్రీకాంత్, భోజన్న, సాయి, పసుల ముత్యం, నాయకులు నిరంజన్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, భోజరాం పటేల్, ధనే నర్సయ్య, శైలేశ్వర్, రమేష్ రెడ్డి, ఉదిగిరి సాయి, మహిబూబ్, మురేష్, పండరి, విజయ్, వినేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఇద్దరిపై కేసు నమోదు

**సిర్పూర్(టి), మార్చి 28, ప్రభాతవార్త:**

సిర్పూర్ మండలంలోని ఆచెల్లి గ్రామపంచాయతీ పారిశుద్ధ్య కార్మికుడైన గోగర్ల శ్రీనివాస్ పై అచ్చిల్లి సర్పంచ్ భర్త అన్న ఇద్దరు కలిసి కార్మికుని పై దాడి చేసి కులం పేరుతో దూషించాడని శ్రీనివాస్ పిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై డి సాగర్ తెలిపారు.

# వృత్తి విద్యా కార్యక్రమానికి విశేష స్పందన

### 31 మందికి కాస్మొటాలజీ సర్టిఫికెట్లు అందజేత

**మందమర్రి, మార్చి 28, ప్రభాతవార్త**



స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ సెంటర్ ఆధ్వర్యంలో ఎస్.సి.సి.ఎల్. సి.ఎస్.ఆర్. కార్యక్రమం భాగంగా మందమర్రి ఏరియాలో నిర్వహించిన కాస్మొటాలజీ కోర్సును విజయవంతంగా పూర్తి చేసుకున్న 31 మంది అభ్యర్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమానికి మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ, సేవా సమితి అధ్యక్షురాలు శ్రీవాణి రాధాకృష్ణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు అభ్యర్థులకు సర్టిఫికెట్లు అందించి అభినందించారు. జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ మాట్లాడుతూ, స్థానిక నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో సింగరేణి సంస్థ సి.ఎస్.ఆర్. నిధుల ద్వారా ఈ విధమైన వృత్తి విద్యా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యువత ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకొని తమ భవిష్యత్తును నిర్మించుకోవాలని సూచించారు. సేవా సమితి అధ్యక్షురాలు శ్రీవాణి రాధాకృష్ణ మాట్లాడుతూ, ఈ కోర్సును ఉపయోగించుకొని స్వయం ఉపాధి దిశగా అడుగులు వేయాలని, ఆర్థికంగా ఎదగాలని అభ్యర్థులకు సూచించారు. ఏఐటీయూసీ మందమర్రి బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ మాట్లాడుతూ, సింగరేణి సంస్థ అందిస్తున్న వృత్తి విద్యా కోర్సులను నేర్చుకొని యువత తమతోపాటు ఇతరుల అభివృద్ధికి కూడా తోడ్పడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సి.ఎం.ఓ.ఏ.ఐ అధ్యక్షులు రమేష్, జీఎంవిటిసి అడిషనల్ మేనేజర్ టి. శ్రీధర్, అసిస్టెంట్ ట్రైనింగ్ మేనేజర్ అశోక్ కుమార్, కాస్మొటాలజీ ట్రైనర్ ప్రీతి, ఇన్స్ట్రక్టర్ డి. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



టీకాలు వేస్తున్న డాక్టర్ రాకేష్

## పశువులకు గాలికుంటు టీకాలు

**పెంచికల్‌పేట్, మార్చి 28, ప్రభాతవార్త :**

మండలంలోని చేడ్వాయి గ్రామ పంచాయతీలో పశువైద్యధికారి డాక్టర్ రాకేష్ ఆధ్వర్యంలో శనివారం పశువులు మేకలకు ఉచిత గాలికుంటు టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులకు వచ్చే వ్యాధులను నివారించేందుకు ప్రభుత్వం చేపడుతున్న ఉచిత గాలికుంటు టీకాల కార్యక్రమాన్ని పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చౌదరి శ్రీనివాస్ పశువైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## కోయవాగు గ్రామంలో అభివృద్ధి పనులకు శ్రీకారం

### - డ్రైనేజి నిర్మాణానికి భూమిపూజ చేసిన సర్పంచ్

**కాగజ్‌నగర్ రూరల్, మార్చి 28, ప్రభాతవార్త :**

కాగజ్‌నగర్ మండలం కోయవాగు గ్రామంలోని 10వ వార్డులో డ్రైనేజీ నిర్మాణానికి శుక్రవారం గ్రామ సర్పంచ్ చింతపల్లి లక్ష్మి చేతుల మీదుగా భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. గ్రామంలో పారిశుద్ధ్య సమస్యలను పరిష్కరించడంతో పాటు, మురుగునీటి సరైన పారుదల కోసం ఈ డ్రైనేజీ నిర్మాణం ఎంతో ఉపయోగపడుతుందని సర్పంచ్ తెలిపారు. గ్రామ అభివృద్ధి దిశగా మరిన్ని మౌలిక వసతుల పనులు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ డ్రైనేజి నిర్మాణంతో గ్రామంలో పరిశుభ్రత మెరుగుపడి, ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడుతుందని గ్రామస్తులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వార్డ్ సభ్యుడు ఆదె శ్రీనివాస్, జావేద్, స్థానిక గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న సర్పంచ్ లక్ష్మి

## కొండపల్లిలో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శ్రీకారం

**పెంచికల్ పేట్, మార్చి 28, ప్రభాతవార్త :**

మండలంలోని కొండపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని అరేవాడలో ఎమ్మెల్యే హరీష్ బాబు సహకారంతో ఉపాధి హామీ పథకం కింద మంజూరు అయిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను శనివారం సర్పంచ్ అన్నం రుక్మబాయి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలంలో బురద, గుంతలతో ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రజలు సీసీ రోడ్డు నిర్మాణంతో సౌకర్యవంతంగా ప్రయాణం చేయగలుగుతారని అన్నారు. గ్రామంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ లక్ష్మి, వార్డు సభ్యులు శేఖర్, భీమేష్, నాయకులు గణపతి, పళ్లెం పురుషోత్తం, చంద్రు, పవన్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ రుక్మబాయి

## బెజ్జూర్ను ప్రత్యేక నియోజకవర్గంగా ఏర్పాటు చేయాలి

**బెజ్జూర్, మార్చి 28, ప్రభాతవార్త:**

బెజ్జూర్ ఎస్టి నియోజకవర్గాన్ని ఏర్పాటు చేయాలని ఆదివాసీ నాయకులు మండల సర్మేడి కొడిపె శంకర్ డిమాండ్ చేశారు. పార్లమెంటులో ప్రతిపాదించిన కొత్త నియోజకవర్గాల పునర్విభజన జరిగితే బెజ్జూర్ మండలాన్ని ప్రత్యేక నియోజకవర్గంగా ప్రకటించాలని అన్నారు. ఆదివాసీలు అధికంగా ఉన్న ఈ ప్రాంతం ఇప్పటికీ అభివృద్ధికి నోచుకోలేదని విద్యా, వైద్యం, రవాణా వ్యవస్థ, వ్యవసాయం అన్ని రంగాల్లోనూ మండలం వెనుకబడి ఉందని అన్నారు. కౌటాల, చింతలమానెపల్లి, పెంచికల్పేట్, బెజ్జూర్ లను కలిపి బెజ్జూర్ నియోజకవర్గంగా ఏర్పాటు చేసినట్లయితే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని ఆయన అన్నారు.

## మాదారం సీసీ రోడ్డు పనులు ప్రారంభం

**తాండూర్, మార్చి 28, ప్రభాతవార్త :**



మండలంలోని మాదారం టౌన్ షిప్ లో శనివారం సర్పంచ్ కుసనపల్లి లక్ష్మీనారాయణ సిసి రోడ్డు నిర్మాణ పనులకు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ సీఈఆర్ క్లబ్ రోడ్డు నుంచి మాదారం గ్రామ పంచాయతీ నర్సరీ వరకు రూ.5 లక్షలు డిఎంఎఫ్టి నిధులతో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టమన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సూరం దామోదర్ రెడ్డి, వార్డు సభ్యులు గోదాల లక్ష్మి, గొర్లపల్లి బానేష్, నాయకులు జోరీగాల రమేష్, మీస శంకర్, తదితరులు పాల్గొన్నారు.

# అస్మిత కుమ్రం భీం ఆసిఫాబాద్ బాక్సింగ్ లీగ్ 2025-26 ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు వేముర్ల మధు



బాక్సింగ్ క్రీడాకారులతో నిర్వాహకులు

**కాగజ్‌నగర్ రూరల్, మార్చి 28, ప్రభాతవార్త :**

కాగజ్‌నగర్ పట్టణంలో శనివారం అస్మిత బాక్సింగ్ లీగ్ 202526 పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మహిళా క్రీడాకారిణుల ప్రతిభను ప్రోత్సహించే లక్ష్యంతో నిర్వహిస్తున్న ఈ పోటీలు మార్చి 26, 2026న కాగజ్‌నగర్‌లోని ముత్తూట్ బాక్సింగ్ అకాడమీ వేదికగా ప్రారంభించారు. భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎస్ఏఐ), ఖేలో ఇండియా కార్యక్రమాల భాగంగా ఈ పోటీలను జిల్లా కలెక్టర్ హరిత ,జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి అష్ఫాగ్ అహ్మద్ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుండి మహిళా క్రీడాకారిణులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శిస్తున్నారు. ఈ సందర్భంగా అతిథులు, క్రీడాకారులు, అధికారులు పరస్పరం ఆత్మీయంగా అభినందనలు తెలియజేసుకున్నారు. గ్రామీణ, గిరిజన ప్రాంతాల మహిళా యువతలో క్రీడలపై ఆసక్తి పెంచడం, వారికి ప్రోత్సాహం అందించడం ఈ లీగ్ ముఖ్య ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. బాక్సింగ్‌లో ప్రతిభ చూపిన క్రీడాకారిణులకు రాష్ట్ర, జాతీయ స్థాయిలో అవకాశాలు కల్పించేందుకు ఈ వేదిక ఎంతో దోహదపడుతుందని జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు వేముర్ల మధు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు వేముర్ల మధు, సెక్రటరీ మదురై శేఖర్, చైర్మన్ ఆర్మీ శివ నాయర్, పీడీలు, పీఈటీలు రాకేష్, సాయి, వంశీ, శివ , ఫిజికల్ డైరెక్టర్ వేముర్ల రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ మాకునూరు వరలక్ష్మి

## ప్యారామూరులో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు ప్రారంభం

**సారంగాపూర్, మార్చి 28, ప్రభాతవార్త:**

సారంగాపూర్ మండలంలోని ప్యారామూరు గ్రామంలో అభివృద్ధి పనులకు శనివారం శ్రీకారం చుట్టారు. ఉపాధి హామీ పథకం కింద కేటాయించిన రూ. 7 లక్షల నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులను సర్పంచ్ మాకునూరు వరలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామంలో సరైన మురుగు కాలువలు, సిమెంట్ రోడ్లు లేక ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఈ పనులు చేపట్టినట్లు తెలిపారు. ప్రభుత్వం నిధులను కేటాయించినందున, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను కోరారు. ఈ అభివృద్ధి పనులతో గ్రామంలో పారిశుధ్య సమస్యలు తొలగిపోతాయని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు భూమారెడ్డి, లింగారెడ్డి, సాయన్న, నారాయణరెడ్డి మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితా ఖచ్చితత్వానికి చర్యలు

### - కాగజ్‌నగర్ తహసిల్దార్ మధుకర్

**కాగజ్‌నగర్, మార్చి 28, ప్రభాతవార్త :**

ప్రత్యేక ఓటరు సవరణ-2025 కార్యక్రమంలో భాగంగా తహసిల్దార్ మధుకర్ శనివారం వార్డ్ నంబర్ 9లోని కౌసర్ నగర్ ప్రాంతంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. బూత్ నంబర్లు 60, 61, 62, 63, 64, 65 పరిధిలో ఓటర్ల వివరాల అనుసంధాన ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా 2025 ఓటర్ల జాబితాలోని వివరాలను 2002 ఓటర్ల జాబితాలోని వివరాలతో సరిపోల్చి అనుసంధానం చేసే కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. ఇంటింటి సర్వే ద్వారా ఓటర్ల వివరాలను సేకరిస్తూ, నమోదు లోపాలను సరిచేస్తున్నారు. తహసిల్దార్ మధుకర్ మాట్లాడుతూ ప్రత్యేక ఓటరు సవరణలో భాగంగా మండలంలోని 116 పోలింగ్ కేంద్రాల పరిధిలో బూత్ స్థాయి అధికారులు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రతి ఓటరు వివరాలు ఖచ్చితంగా నమోదు కావడం లక్ష్యమన్నారు. 2025 ఓటరు జాబితాలో నమోదు అయి ఉండి 2002 జాబితాలో లేని, ముఖ్యంగా 40 సంవత్సరాల్లోపు ఉన్న ఓటర్లను వారి తల్లిదండ్రుల ఓటర్లతో అనుసంధానం చేస్తున్నట్లు వివరించారు. దీని ద్వారా ఓటరు వివరాలు స్పష్టంగా ఉండి ఎన్నికల సమయంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉంటాయని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు ఇంటింటి సర్వేకు వచ్చినప్పుడు ప్రజలు సహకరించాలని, సరైన వివరాలు అందించాలని తహసిల్దార్ మధుకర్ కోరారు. ఓటరు జాబితా సక్రమంగా పూర్తి కావడానికి ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని అన్నారు. ఓటరు జాబితా శుద్ధి, పారదర్శకత కోసం ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు






## ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి: కోటపల్లి సీఐ ఆర్. కృష్ణ

### - ఏప్రిల్ 3న నిర్వహించబడే ఉచిత నేత్ర వైద్య చికిత్స శిబిరం వాల్ పోస్టర్ ఆవిష్కరించిన పోలీసులు

**కోటపల్లి, మార్చి 28, ప్రభాతవార్త**

లయన్స్ క్లబ్ ఆఫ్ చెన్నూర్ ఆధ్వర్యంలో ఈ నెల ఏప్రిల్ 3వ తేదీన మైనారిటీ ఫంక్షన్ హాల్ వద్ద నిర్వహించనున్న భారీ ఉచిత నేత్ర వైద్య చికిత్స శిబిరానికి సంబంధించిన వాల్ పోస్టర్ శనివారం కోటపల్లి మండల కేంద్రంలో సీఐ ఆర్. కృష్ణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ.. సామాజిక సేవలో లయన్స్ క్లబ్ ముందుండటం అభినందనీయమన్నారు. కంటి సమస్యలతో బాధపడే నిరుపేదలకు ఈ శిబిరం ఒక వరం వంటిదని పేర్కొన్నారు. కోటపల్లి, నీల్వాయి, చెన్నూర్ మరియు పరిసర గ్రామాల ప్రజలు, వృద్ధులు ఈ అవకాశాన్ని పెద్ద ఎత్తున సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. వైద్య శిబిరానికి వచ్చే వారికి నిపుణులైన వైద్యులతో పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి తగిన చికిత్సలు అందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జైపూర్ ఎస్సై రాజశేఖర్, లయన్స్ క్లబ్ ఆఫ్ చెన్నూర్ ప్రెసిడెంట్ లయన్ జాడి తిరుపతి, లయన్ నిమ్మల సాగర్, లయన్ పెద్దింటి పున్నం చంద్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## నేడు హనుమాన్ శోభాయాత్ర

**ఆసిఫాబాద్, మార్చి 28, ప్రభాతవార్త:**

జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ వీరాంజనేయ స్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో హనుమాన్ దీక్షా స్వాములతో ఆదివారం ఉదయం ఆలయం నుంచి పట్టణ ప్రధాన వీధుల గుండా శోభాయాత్రను నిర్వహించడానికి నిర్ణయించినట్లు ఆలయ కమిటీ తెలిపారు. ఉదయం ఏడు గంటలకు వీరాంజనేయ స్వామి ఆలయం వద్ద ప్రముఖుల ఆధ్వర్యంలో ప్రారంభమయ్యే ఈ శోభాయాత్ర సాయిబాబా మందిర్, పొట్టి శ్రీరాములు చౌక్, గాంధీ చౌక్ , వివేకానంద చౌక్, అంబేద్కర్ చౌక్ల మీదుగా కొనసాగుతుందని తెలిపారు. పట్టణంలోని హనుమాన్ దీక్ష స్వాములతో పాటు సమీప గ్రామాల దీక్షాస్వాములు, భక్తులు, ప్రముఖులు ఈ శోభాయాత్రలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



స్థలం పరిశీలిస్తున్న దృశ్యం

## సోలార్ లైట్‌కు స్థలం పరిశీలన

**వేమనపల్లి, మార్చి 28, ప్రభాతవార్త**

బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, మాజీ జడ్పీటీసీ సభ్యులు ఆర్. సంతోష్ కుమార్ సహకారంతో సుమారు రూ.2 లక్షల సీఎస్ఆర్ నిధులతో ముల్కలపేట గ్రామంలో ఎస్సీ కాలనీలో సోలార్ లైట్ మంజూరు కాగా అట్టి సోలార్ లైట్ ఏర్పాటు కొరకు స్థలాన్ని శనివారం రోజు స్థానిక సర్పంచ్ ఒడిల కళ్యాణి సుధాకర్, మాజీ ఎంపీపీ ఆకుల లింగాగౌడ్, మాజీ వైస్ ఎంపీపీ ఒడిల రాజన్న కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు కామెర గణేష్, ఎడ్ల మహేష్, నాయకులు ధన్నూరి హేమాజీ, ఎన్నం సంజీవ్, ఎల్కరి విజయ్, కొంపూరి రమేష్, గుదేపెల్లి రవి, ఎడ్ల గణేష్, కొండ్ర శ్యాంసుందర్ తదితరులు కలిసి పాల్గొన్నారు.

## మున్సిపల్ 2026-27 వార్షిక బడ్జెట్ సమావేశం

**లక్షెట్టిపేట, మార్చి 28, ప్రభాతవార్త**




లక్షెట్టిపేట మున్సిపాలిటీలో 2026-27 బడ్జెట్ సమావేశం అడిషనల్ కలెక్టర్ చంద్రయ్య ఆధ్వర్యంలో ప్రవేశ పెట్టడం జరిగింది. శనివారం రోజు మున్సిపాలిటీలో ఏర్పాటు చేసిన బడ్జెట్ సమావేశంలో వార్షిక బడ్జెట్ ను ప్రవేశపెట్టడం జరిగింది. మెజారిటీ కౌన్సిల్ సభ్యులు ఆమోదించగా 2026 27 వార్షిక బడ్జెట్ 25 కోట్ల 74 లక్షల 89 వేల రూపాయలను ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. సాధారణ పన్నుల ఆదాయ వనరులు, మున్సిపల్ సాధారణ నిధులు, ప్రభుత్వ పథకాలు, ఇంజనీరింగ్ విభాగం నిర్వహణ ఖర్చులు, ఇతర గ్రాంట్లు, ఇలా మొత్తంగా వార్షిక ఆదాయం ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. అలాగే వివిధ వార్డులలో అభివృద్ధి పనులకు కేటాయింపులు చేయడం జరిగిందని తెలిపారు. ఈ వార్షిక బడ్జెట్ మున్సిపాలిటీ అభివృద్ధి కోసం వినియోగించుకుని అభివృద్ధి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దొంత అంజలి-నరసయ్య, వైస్ చైర్మన్ మోత్కూరి రాజేశ్వరి వెంకటస్వామి గౌడ్, వార్డ్ కౌన్సిల్ సభ్యులు, వివిధ మున్సిపల్ విభాగ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బాసర ట్రిపుల్ ఐటీని అక్రమార్కుల నుంచి కాపాడుకుందాం

**- ఓయూ జేఏసీ అధ్యక్షుడు సర్దార్ వినోద్ కుమార్**



**భైంసా, మార్చి 28, ప్రభాతవార్త**

బాసర ట్రిపుల్ ఐటీని కాంట్రాక్టులు, కమీషన్ ఏజెంట్ల నుండి కాపాడుకోవాల్సిన అవసరం ఉందని ఓయూ జేఏసీ అధ్యక్షులు సర్దార్ వినోద్ కుమార్ పిలుపునిచ్చారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. గ్రామీణ పేద విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ఈ ప్రతిష్టాత్మక సంస్థ ప్రస్తుతం అవినీతికి అడ్డాగా మారిందని ఆరోపించారు. ఈసీ లేకపోవడాన్ని ఆసరాగా చేసుకుని, నామినేషన్ పద్ధతిలో లక్షలాది రూపాయల పనులు చేస్తూ నిధులు కొల్లగొడుతున్నారని విమర్శించారు. గతంలో ఫుడ్ పాయిజన్ ఘటనలో నిందితులుగా ఉన్న సంస్థలకే తిరిగి మెస్ కాంట్రాక్టులు కట్టబెట్టడం వెనుక భారీ ముడుపుల వ్యవహారం ఉందని ఆరోపించారు. వీసీ గోవర్ధన్, ఓఎస్డీ దర్శన్ తమ వ్యక్తిగత అవసరాల కోసం కొత్త పోస్టులు సృష్టించి, ఏళ్లుగా పనిచేస్తున్న అధ్యాపకులను, విద్యార్థులను వేధిస్తున్నారని మండిపడ్డారు. ప్రశ్నించిన విద్యార్థి సంఘం నాయకులను బంధించి ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. సమస్యలపై నిలదీస్తున్న స్థానిక మీడియాను, ఎమ్మెల్యేను, విద్యార్థి సంఘాలను లక్ష్యంగా చేసుకుని వీసీ వర్గం కులాల పేరుతో విషప్రచారం చేస్తోందని ధ్వజమెత్తారు. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉండి యూనివర్సిటీ ప్రతిష్టను మసకబారుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులు లేవనెత్తిన 12 డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని, యూనివర్సిటీలో జరుగుతున్న అక్రమాలపై ప్రభుత్వం విచారణ జరిపించాలని కోరారు. అక్రమార్కుల నుండి ట్రిపుల్ ఐటీని రక్షించుకోవడానికి ఎంతటి పోరాటానికైనా సిద్ధమని, ఈ అక్రమాలను ఆధారాలతో సహా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని వినోద్ కుమార్ స్పష్టం చేశారు.

# షెడ్యూల్డ్ కులాల యువత నుంచి దరఖాస్తుల స్వీకరణకు గడువు పొడిగింపు

**- మంచిర్యాల జిల్లా షెడ్యూల్డ్ కులముల సేవా సహకార అభివృద్ధి సంఘం ఈఈ చాతరాజుల దుర్గాప్రసాద్**

**నస్పూర్, మార్చి 28, ప్రభాతవార్త**

2025-26 సంవత్సరానికి గాను షెడ్యూల్డ్ కులాల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ప్రభుత్వ ఆమోదిత మొదటి విడత పథకాల కోసం అర్హత గల ఎస్.సి. యువత దరఖాస్తు చేసుకునేందుకు గడువును ఏప్రిల్ 2వ తేదీ వరకు పొడిగించడం జరిగిందని జిల్లా షెడ్యూల్డ్ కులముల సేవా సహకార అభివృద్ధి సంఘం ఈ.ఈ. చాతరాజుల దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. రవాణా రంగం ఎలక్ట్రికల్ లో ఈ.వి. ద్విచక్ర వాహన లక్ష్యం 185 యూనిట్లకు గాను 608 దరఖాస్తులు, ఈ.వి. త్రిచక్ర వాహనం (సరకు/ప్రయాణికుల రవాణా) లక్ష్యం 91 యూనిట్లకు గాను 838 దరఖాస్తులు, వ్యవసాయ పథకాలలో సోలార్ యూనివర్సల్ పంపు కంట్రోల్, వ్యవసాయ అనుబంధ భాగం లక్ష్యం 19 యూనిట్లకు గాను 73 దరఖాస్తులు ఆన్ లైన్ లో https://tgobmms.cgg.gov.in నమోదు కావడం జరిగిందని తెలిపారు. ఆసక్తి, అర్హత గల షెడ్యూల్డ్ కులములకు చెందిన యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

# కొలం గిరిజనులకు ఇందిరమ్మ ఇల్లు ఏదీ..?

**ఉట్నూర్, మార్చి 28, ప్రభాతవార్త :**



దొంగ చింత, కుమ్మరి కుంట కోలాంగుడా గ్రామాలను శనివారం సందర్శించిన లంబాడిలా హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ భరత్ చవాన్. అయన మాట్లాడుతూ కొలం గిరిజనులకు ఇంద్రమ్మ ఇల్లు ఏది అన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి మాకు ఇండ్లు మంజూరయ్యాయి అని సంతోషపడి ఉన్నటువంటి ఇండ్లను తీసేసి గుడిసెలలో ఉంటూ బేస్ మెట్లు తవ్వడం జరిగిందన్నారు. అటవీ అధికారుల వల్లె ఇల్లు కట్టకుండా ఆగిపోతుందన్నరు. ప్రభుత్వం వెంటనే ఇండ్ల నిర్మాణానికి కావలసిన అనుమతులు ఇచ్చి ఇండ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. లేనిపక్షంలో గిరిజన తిరుగుబాటు ఉంటుందని హెచ్చరించారు.. ఇట్టి సమావేశంలో కోలాం సంఘం రాష్ట్ర నాయకులు టేకం వసంతరావు ఆత్రం ముకుందరావు కొడప రాజు మడవి రమేష్..టెకం రాజు పటేల్ టెక్కం చిన్ను కడప అనసూయ శ్రీడం ధర్మం టేకంజంగు ఉడపా అనిల్ శ్రీరామ్ లతోపాటు ఉట్నూర్‌కు చెందిన గంగారాం నాయక్ రామారావు నాయక్ సీతారాం తదితరులు పాల్గొన్నారు.

# ఏప్రిల్ 6 లోపు జర్నలిస్టు దరఖాస్తులు చేసుకోవాలి

**ఆసిఫాబాద్, మార్చి 28, ప్రభాతవార్త:**



తెలంగాణ రాష్ట్రంలోని జర్నలిస్టులు అక్రెడిటేషన్ కార్డుల కోసం ఏప్రిల్ 6వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ ప్రియాంక తెలిపారు. జర్నలిస్టులు తమ యాజమాన్యాల నుంచి పొందిన సిఫార్సు లేఖతో పాటు అవసరమైన పేపర్ కటింగులు, విద్యార్హతల సర్టిఫికెట్లు, ఇండిపెండెంట్ జర్నలిస్టులు కటింగ్లతో పాటు సంబంధిత ఎడిటర్ పత్రికకు వార్తలు రాసినట్లు ధ్రువీకరించే లేఖను జత చేయడంతో పాటు తాము వేరే ఇతర వృత్తులలో అనగా సొసైటీ చైర్మన్, డైరెక్ట ప్రభుత్వ ఉద్యోగం, న్యాయవాద వృత్తి, సర్పంచ్ తదితర ఏపదవుల్లో కొనసాగడం లేదని సెల్ఫ్ డిక్లరేషన్ జతచేసి హార్డ్ కాపీని సంబంధిత డిపిఆర్ఓ కార్యాలయాలలో అందజేయాలన్నారు. ఆ అప్లికేషన్‌ను పూర్తి చేసి ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయాలని వెల్లడించారు. ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం అర్హులైన వారికే అక్రెడిటేషన్ కార్డులు మంజూరు చేయనున్నట్లు స్పష్టం చేశారు. తప్పుడు సమాచారం ఇచ్చిన వారిపై సంబంధిత అధికారులకు కఠిన చర్యలకై ఆదేశాలు ఇవ్వనున్నట్లు స్పెషల్ కమిషనర్ వెల్లడించారు ఇప్పటికే రాష్ట్ర అక్రెడిటేషన్ కమిటీ రెండు సార్లు సమావేశమై జీఓ అమలు, విధి విధానాలపై చర్చించిందని, అందరికీ సమాన అవకాశాలు కల్పించే దిశగా ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. ఇప్పటికే వచ్చిన దరఖాస్తులను సమీక్షిస్తూ, అర్హత ప్రమాణాలు పూర్తి చేసిన జర్నలిస్టులకు కార్డులు జారీ చేసే చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

# కాగజ్‌నగర్‌లో వీర హనుమాన్ శోభాయాత్రకు అనుమతులు ఇవ్వండి

**- డీఎస్పీని కలిసిన హిందూ జాగరణ్ మంచ్**

**కాగజ్‌నగర్ రూరల్, మార్చి 28, ప్రభాతవార్త :**

కాగజ్‌నగర్ పట్టణంలో నిర్వహించనున్న శ్రీ వీర హనుమాన్ శోభాయాత్రకు సంబంధించి హిందూ జాగరణ్ మంచ్ సభ్యులు పోలీస్ అధికారులను కలిసి అనుమతులు కోరారు. ఈ సందర్భంగా శనివారం కాగజ్‌నగర్‌లోని డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ వహీదుద్దీన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఏప్రిల్ 2న నిర్వహించనున్న శోభాయాత్ర వివరాలను తెలియజేశారు. కార్యక్రమాన్ని శాంతియుతంగా, విజయవంతంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ నుంచి పూర్తి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం టౌన్ సీఐ ప్రేమ్ కుమార్‌ను కలిసి శోభాయాత్రకు అవసరమైన భద్రతా ఏర్పాట్లు, బందోబస్తు మరియు ఇతర అనుమతుల కోసం వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో హిందూ జాగరణ్ మంచ్ జిల్లా అధ్యక్షులు శివ గౌడ్, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.




డీఎస్పీ వహిదుద్దీన్‌కు వినతిపత్రం అందజేస్తున్న హిందూ జాగరణ్ మంచ్ సభ్యులు

# సీసీలు, వివోఏలకు ఓరియంటేషన్ శిక్షణ.. పరీక్షల నిర్వహణపై అవగాహన

**దిలావర్‌పూర్, మార్చి 28, ప్రభాతవార్త:**

నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలంలోని సీసీలు (క్లస్టర్ కోఆర్డినేటర్లు), వివోఏలకు పరీక్షల నిర్వహణపై శనివారం ప్రత్యేక ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. పరీక్షలను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించే విధానంపై అధికారుల ద్వారా సవివరంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పరీక్షా పత్రాలు, అవార్డు లిస్టులు, రిజిస్ట్రేషన్ ఫార్ములు, పెన్నులు తదితర సామగ్రిని సీసీలు, వివోఏలకు పంపిణీ చేశారు. ప్రతి గ్రామంలో పరీక్షలు సక్రమంగా జరగడానికి అవసరమైన ఏర్పాట్లపై అధికారుల సూచనలు ఇచ్చారు. ఉల్లాస్ ˇఅమ్మకు అక్షరమాల కార్యక్రమంలో భాగంగా గత ఏడాది మండలవ్యాప్తంగా 1572 మంది స్వయం సహాయక సంఘ సభ్యులను నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. మహిళల్లో అక్షరాస్యత పెంపొందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు. ఆదివారం అన్ని గ్రామాల ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించనున్న పరీక్షకు 865 మంది సభ్యులు హాజరై ఉత్తీర్ణత సాధించాలని అధికారులు పిలుపునిచ్చారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి లోపాలు లేకుండా క్రమశిక్షణతో వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ సదానందం, ఏపీఎం బోసు, సీసీలు సాయన్న, పోశెట్టి, ముత్యం, కార్యాలయ సిబ్బంది గంగాధర్, మహేష్, సుధాకర్ మరియు వివిధ గ్రామాల వివోఏలు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఎంఈఓ సదానందం, ఏపీఎం బోసు, సిబ్బంది.